నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింద తెలిపిన ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష్మీనగర్ క్రాస్ రోడ్, రామాలయం, వాణీనగర్, పటేలమ్మ మడిగె, ఆనంద్ బిస్కెట్ ఫ్యాక్టరీ, ధోబీఘాట్ రోడ్, ఆనంద్ నగర్, మలక్‌పేట ప్రొఫెసర్స్ కాలనీ, హనుమాన్ టెంపుల్, డీ మార్ట్, చర్మాస్, అల్మారీ కార్ఖానా, సంతోష్‌నగర్, ఎంఐజీహెచ్, సంతోష్ నగర్ 2 నెంబర్ గల్లీ, సంతోష్‌నగర్ కాలనీ, సంతోష్‌నగర్ పీఎస్ పరిసర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.అలాగే మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు భూలక్ష్మీ నగర్, తిరుమలహిల్స్, గడ్డిఅన్నారం, కల్యాణ్ నగర్, వాణీ కాలేజ్, కిడ్నీ హాస్పిటల్, నల్గొండ క్రాస్‌రోడ్, సాహైల్ హోటల్, గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్, చంచల్‌గూడ, ఓల్డ్ అండ్ న్యూ సంతోష్‌నగర్, ఒవైసీ నగర్, హస్నాబాద్, రాయల్ పీ హోటల్, సన టీ పాయింట్, సరళాదేవి నగర్, కెనెరా బ్యాంక్, తర్కారీ పీటీ, క్రిస్టల్ బార్ లేన్, ఐఎస్‌సదన్ మెయిన్‌రోడ్ పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమోటా రూ.21, వంకాయ రూ.23, బెండ రూ.38, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.40, దొండ రూ.18, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.37, దోసకాయ రూ.15, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.23, అరటి కాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామ గడ్డ రూ.28, మునగ రూ.65, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.23, కీర రూ.35, బీన్స్ రూ.65, క్యాప్సికమ్ రూ.60. ఈరోజు శనివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

మూసారంబాగ్‌లో ఫాగింగ్ స్పెషల్ డ్రైవ్



మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్ట్ కింద నిర్వహిస్తున్న వీక్లీ వన్స్ ఫాగింగ్ ప్రక్రియను శుక్రవారం జీహెచ్‌ఎంసీ అడిషినల్ కమిషనర్ పంకజ, సౌత్ జోనల్ కమిషనర్ వెంకన్న, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి పరిశీలించారు. కృష్ణ తులసి నగర్, మూసారంబాగ్, కాలనీలలో, బస్తీల్లో ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పలు సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి డివిజన్‌కు ఇంతకు ముందులాగే ఫాగింగ్ మెషీన్ ఏర్పాటు చేయాలన్నారు. మూసీ పరిసర ప్రాంతాలకు ఫాగింగ్ ఎక్కువగా అవసరమని, స్ట్రీట్ లైట్స్ కూడా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజీ శ్రీనివాస్, ఏఈ శివ, ఎలక్ట్రికల్ ఈఈ రామరావు, ఏఈ రాజు, గుండప్ప, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సైదాబాద్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ అరుణ అధికారులకు సూచించారు. శుక్రవారం మాధవనగర్ కాలనీ పార్కు వద్ద రూ.15 లక్షల 75 వేలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..తమ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను స్థానికులు సైతం తరచూ పరిశీలిస్తుండాలని, ఏమైనా అవకతవకలు చోటు చేసుకుంటే తన దృష్టికి తీసుకువస్తే సరిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, కాలనీవాసులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

హయత్‌నగర్: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్‌లో నివసించే కందుల ఉదయ్‌కుమార్(39) వ్యాపారస్తుడు. గురువారం రాత్రి పని ముగించుకుని ఎల్‌బీనగర్ నుంచి ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారిపై తన బైకుపై వస్తున్నాడు. లక్ష్మారెడ్డి పాలెంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలోకి రాగానే ఓ గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయమైన ఉదయ్‌య్‌కుమార్ రోడ్డుపై పడిపోగా 108 వాహనంలో అతడిని వనస్థలిపురంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా సౌత్ వెస్ట్ పార్కు

● కనీస వసతులు కరువు ● పట్టించుకోని అధికారులు ● పార్కును అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు



పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారం



బెంచీ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

మలక్‌పేట: మూసారం బాగ్ డివిజన్ సలీంనగర్ సౌత్‌వెస్ట్ పార్కు అధ్వానంగా మారింది. కాలనీలో 15 అపార్ట్‌మెంట్‌లు, ఇండిపెండెంట్ హౌజెస్ ఉన్నాయి. దాదాపు 2000 మంది జనాభా ఉంటుంది. వాకింగ్ కోసం కాలనీ వాసులు పక్క కాలనీలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో పార్కు నిండిపోయింది. పార్కులో కనీస వసతులు కల్పించకపోవడంతో పార్కుకు ఎవరూ వెళ్లడం లేదు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పార్కును అభివృద్ధి చేసి అవసరమైన వసతులు కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



గుంతలమయంగా పిల్లల ఆటస్థలం

వానొచ్చిందంటే..

వానొచ్చిందంటే చాలు పార్కుల సమీపంలో వరద నీరు నిలిచి పెద్ద నీటి కలువను తలపిస్తుంది. దీంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారానికి నోచుకోలేదని కాలనీవాసులు మండి పడుతున్నారు. వరద నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

అసాంఘిక కార్యాకలపాలకు అడ్డాగా..

పార్కులో సౌకర్యాలు లేకపోవడంతో అటువైపు రాకపోకలు తక్కువ. ఇదే అదనుగా తీసుకున్న ప్రేమ జంటలు ఇక్కడే వచ్చి పార్కు పరిసరాల్లో గంటలు గంటలు గడుపుతారని కాలనీవాసులు పేర్కొంటున్నారు. చీకటి పడిందంటే చాలు తాగుబోతులు వచ్చి మద్యం తాగడానికి వస్తారని చెబుతున్నారు.

పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



పార్కు వైపు కన్నెత్తి చూసే అధికారులు లేరు. సరైన వసతులు లేక పార్కులోకి కాలనీవాసులు ఎవరూ రావడం లేదు. పార్కు నిర్వహణ సరిగా లేదు. 5 నెలలుగా వాచ్‌మెన్ జీతాలు రావడం లేదు. పార్కును అభివృద్ధి చేయాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేస్తే నిధులు లేవు అని చెబుతున్నారు. ప్రేమ జంటలు, మందు బాబులతో ఇబ్బందుపడుతున్నాం. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి గస్తీ పెంచాలి.

– ప్రొద్దుటూరి ప్రవీణ్,కాలనీవాసి,బీఆర్ఎస్ నేత

అదనపు అంతస్తు నిర్మాణానికి కృషి

ఎల్‌బీనగర్: సీనియర్ సిటిజన్ భవనంలో మరో అదనపు అంతస్తు నిర్మాణం చేపట్టి లిఫ్ట్ సౌకర్యం కలిప్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ ప్రగతినగర్‌కాలనీలో నూతనంగా నిర్మించిన ఆదర్శ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనాన్ని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకంగా మహిళలకు మరో అంతస్తు నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం సహారాస్టేట్స్‌కాలనీలో రూ.61.5లక్షలతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో



నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు వీరారెడ్డి, సత్యనారాయణ, రాంరెడ్డి, సోమిరెడ్డి, సహారాస్టేట్స్ కాలనీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, సుదర్శన్‌రెడ్డి, మంజుల, వెంకట్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

నేడు తెలంగాణ జన సమితి రంగారెడ్డి జిల్లా ప్లీనరీ

నాగోలు: తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనే లక్ష్యంగా తెలంగాణ జన సమితి(టీజేఎస్) రంగారెడ్డి జిల్లా ప్లీనరీ శనివారం ఎల్‌బీనగర్‌లోని భాగ్యనగర్ ఫంక్షన్ హాల్ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ జన సమితి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పల్లె వినయ్‌కుమార్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం భూనిర్వాసితులకు న్యాయం కోసం, స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు, ఉద్యోగ, ఉపాధి ఆవకాశాల సాధన కోసం ఎమ్మెల్సీ కోదండరామ్ నాయకత్వంతో నిత్యం రాష్ట్ర ప్రభుత్వంలో చర్చలు జరుపుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి రంగారెడ్డి జిల్లా టీజేఎస్ కృషి చేస్తుందని అన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



ప్రశాంత్‌నగర్‌లో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలు కట్టిన పన్నులను కాళేశ్వరం పేరుతో తగలేసిందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో శ్రీకనకదుర్గ అమ్మవారి దేవాలయం వద్ద నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపనకు స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీలో జరుగుతున్న అభివృద్ధి అంతా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చలువేనని అన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని, బీజేపీ కార్పొరేటర్లు ఉన్న చోట కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తగిన నిధులు ఇస్తోందని అన్నారు. ఎల్‌బీనగర్‌లో ఆయా డివిజన్లకు బీఆర్ఎస్ 10 ఏళ్లకాలంలో రానన్ని నిధులు కాంగ్రెస్ ప్రభుత్వ 18 నెలల కాలంలో వచ్చాయని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాలనీల సమస్యలను పట్టించుకోవడం లేదని, కాలనీవాసులు తనవద్దకు వస్తే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నేలపాటి రామారావు, అశోక్‌గౌడ్, స్వర్ణమాధవి, కవిత, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలాజీనాథ్, ప్రధాన కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, భుజంగరెడ్డి, యుగంధర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నందారెడ్డి, పద్మారెడ్డి, కృష్ణమూర్తి, వాణి, లక్ష్మారెడ్డి, అంజయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

చాదర్‌ఘాట్: విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని యూపీహెచ్‌సీ మలక్‌పేట ఏఎన్‌ఎం ఇందిర అన్నారు. శుక్రవారం మలక్‌పేటలోని మూగ, బధిరుల ఆశ్రమ పాఠశాల, మూగ, బధిరుల ఉన్నత పాఠశాలలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం ఇందిర మాట్లాడుతూ..వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు నీరసంగా ఉన్నా, మోషన్స్‌కు గురైనా వెంటనే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.యుగంధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశావర్కర్ జ్యోతి పాల్గొన్నారు.



విద్యార్థులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లపై అవగాహన కల్పిస్తున్న ఆశావర్కర్లు

ప్రభుత్వ పాఠశాలల్లో జోరుగా అడ్మిషన్లు



మాట్లాడుతున్న అస్రా ఫాతిమా

చాదర్‌ఘాట్: గతేడాది కంటే ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు బాగా ఉన్నాయని హిమాయత్‌నగర్ డిప్యూటీ డీఈఓ అస్రా ఫాతిమా తెలిపారు. శుక్రవారం మలక్‌పేటలోని మూగ బధిరుల పాఠశాలలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబర్‌పేట మండలంలోని13 ఉన్నత పాఠశాలలో 720మేర విద్యార్థులు అడ్మిషన్లు పొందారని తెలిపారు. గతేడాది కంటే ఈసారి స్పందన బాగుందని అన్నారు. పాఠశాలలు తెరవగానే మొదటి విడత స్కూల్ యూనిఫాంలు, బుక్స్, నోట్స్ ఇచ్చామని తెలిపారు. రెండో విడత యూనిఫాంలు రెండు నెలల తర్వాత అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో అడ్మిషన్లపై ఉపాధ్యాయులు చొరవ చూపారని అన్నారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.11లక్షలతో పార్కును సుందరంగా తీర్చిదిద్దుతాం

లింగోజిగూడ: ప్రజలు కడుతున్న పన్నులతోనే ప్రజాప్రభుత్వం కాలనీలలో అభివృద్ధి పనులను చేపడుతోందని జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని జానకీ ఎన్‌క్లేవ్ పార్కు అభివృద్ధి, పునర్నిర్మాణ పనులకు కాలనీవాసులతో కలిసి శుక్రవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ఉన్న పార్కులను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ పార్కును రూ.11 లక్షలతో సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీనివాసచారి, జీవన్ కాలనీ అధ్యక్షుడు కె.వెంకటయ్య, జి.మల్లికార్జున్, ఎస్.చంద్రశేఖర్, జూలూరి శ్రీనివాస్, ఎం.లక్ష్మారెడ్డి, జే.ఈశ్వరయ్య, మురళీధర్, సురేంద్రకుమార్, దామోదర్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, కందికంటి శ్రీధర్‌గౌడ్, రోహిత్, వెంకట్‌రెడ్డి, నరేశ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



పార్కు పనులకు భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

సైదాబాద్: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని ఏఐవైఎఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్ డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. శుక్రవారం సింగరేణి కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సంఘం ప్రతినిధులతో కలిసి చలో రాజ్‌భవన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..దేశంలో ఎక్కడో ఒక చోట ఏదో రకమైన అలజడులు సృష్టిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లబ్ధి పొందుతుందని ఆరోపించారు. మణిపూర్‌లో అల్లర్లే అందుకు రుజువని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దశరథ్ నాయక్, చింటు, రాజు, అజయ్‌కుమార్, భాస్కర్, గణేష్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి

హయత్‌నగర్: టిప్పర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి చెందాడు. ముందుగా వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ సడెన్ బ్రేకు వేయడంతో వెనుక వైపు నుంచి బైకుపై వస్తున్న కానిస్టేబుల్ టిప్పర్‌ను ఢీ కొట్టి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మిర్యాలగూడ దొంగ తండాకు చెందిన రమావత్ మాన్‌సింగ్ యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం తొర్రూర్ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. విధులు ముగించుకుని గురువారం సాయంత్రం పల్సర్ బైకుపై ఇంటికి ఔటర్ రింగ్ రోడ్డు సర్వీసు రోడ్డుపై వస్తున్నాడు. పస్మాముల–పెద్దఅంబర్‌పేట్ మధ్యలో ముందుగా వెళ్తున్న ఓ టిప్పర్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకు వేయడంతో వెనుక నుంచి వస్తున్న బైకు టిప్పర్‌ను ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడ్డ మాన్‌సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మాన్‌సింగ్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. హెల్మెట్ ఉండి కూడా ధరించకపోవడంతోనే మాన్‌సింగ్ తలకు తీవ్ర గాయం అయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

మలక్‌పేట: సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) నేతలు శుక్రవారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ కమిషనర్ క్షితిజ, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని వేర్వేరుగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ దామల సత్యం మాట్లాడుతూ..విద్యార్థుల దరఖాస్తులు తీసుకుని అప్లోడ్ చేసి వసతి గృహాల్లో చేర్చుకోవాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ గురుకుల కాలేజీలు, పాఠశాలలో సీట్లు ఇవ్వాలన్నారు. బీఆర్ అంబేడ్కర్ భవనాలకు మరమ్మతులు చేపట్టాలని, న్యూ అంబేడ్కర్ భవనం ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు వారు తెలిపారు. నాయకులు కొప్పుల రామరావు, రవి ఉన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రూ.75కోట్ల ఆయిల్ విక్రయాలు

ఉత్తమ పెట్రోల్ బంకుగా చంచల్‌గూడ

చంచల్‌గూడ: జంటనగరాల్లో అత్యధిక ఆయిల్ విక్రయించిన పెట్రోల్ బంకుగా చంచల్‌గూడలో జైళ్ల శాఖ నిర్వహిస్తున్న బంకు ఎంపికైనట్లు చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ నవాబు శివకుమార్‌గౌడ్ తెలిపారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో బేగంపేట్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈ విషయం ప్రకటించినట్లు తెలిపారు. చంచల్‌గూడ బంకు 2024–2025 సంవత్సరానికి మొత్తం రూ.75 కోట్లు విలువైన పెట్రోల్, డీజిల్ అమ్మకాలు జరిపినందుకు ఉత్తమ బంకుగా అవార్డు ప్రకటించారు. ఐఓసీ సంస్థ డివిజనల్ మేనేజర్ సుబ్రతోరాయ్ చేతులమీదుగా సూపరింటెండెంట్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విక్రయాల్లో వచ్చిన లాభాలను ఖైదీల సంక్షేమానికే వినియోగిస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన ఆయిల్ అందించడంలో జైళ్ల శాఖ ముందుంటుందన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు



నాగోలు: ఒడిశా నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న ముఠాలోని నలుగురిని ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, హయత్‌నగర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.65 లక్షల విలువైన 166 కేజీల గంజాయి, ఒక కారు, 4 మొబైల్ ఫోన్లు, రూ.6,200, నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన వికాస్ బాబన్ సాల్వే(30) పాతనేరస్తుడు, గంజాయి సరఫరా చేసే వ్యాపారి) అదే ప్రాంతానికి చెందిన రంగనాథ్ యురాజిన్ సాల్వే, సాగర్ గజానన్ ఖండే భరత్, ఆలియస్ సాగర్ రైల్వే డిపార్ట్‌మెంట్ నాందేడ్ సబ్ డివిజన్‌లో ట్రాక్ మెయింటెయిన్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన అమోల్ నారాయణ్ బోర్డేలు కలిసి ఓ ముఠా ఏర్పాడ్డారు. వికాస్ బాబన్ సాల్వేకు ఒడిశాకు చెందిన మైక్ ఆలియస్ రాహుల్‌తో పరిచయం పెంచుకున్నాడు. వికాస్ బాబన్ విలాసవంతమైన జీవితం గడపాలని గంజాయిని విక్రయించడం ద్వారా త్వరగా డబ్బులు సంపాదించవచ్చని ప్లాన్ చేసుకున్నాడు. మహారాష్ట్రలోని కార్మికులలో ఎక్కువ మంది గంజాయికి బానిస అయ్యారని వారికి గంజాయికి విక్రయించి త్వరగా డబ్బులు సంపాదించడానికి తన స్నేహితులతో కలిసి ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. దీంతో వికాస్ స్నేహితులైన సాగర్ గజానన్, రంగనాథ్, అమోల్ నారాయణ ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలోని సరఫరా చేసేందుకు హైదరాబాద్ మీదుగా రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి, మైక్ ఆలియస్ రాహుల్ వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి అక్కడ నుంచి సాగర్ గజానన్, రంగనాథ్, అమల్ నారాయణ్, రాహుల్‌లు కలిసి ఫోర్స్ ట్రాక్స్ క్రూయిజర్‌లో హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు వెళ్తున్నారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, హయత్‌నగర్ పోలీసులు హయత్‌నగర్ పరిధిలోని ధనంజయ ఫంక్షన్ హాల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో సీట్ వెనుకల గంజాయి దాచి పెట్టి రవాణా చేస్తున్నారు. పోలీసులు వికాస్, సాగర్ గజానన్, రంగనాథ్, అమల్ నారాయణ్‌ను పట్టుకొని 166 కిలోల గంజాయి, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఇందులో ప్రధాన నిందితుడైన రాహుల్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటీ అడిషనల్ డీసీపీ షకీర్ హుస్సేన్, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సర్కిల్–6 డీసీ జయంత్ అధికారులకు సూచించారు. డివిజన్ ఈఈ, ఏఈ మొబిన్ పాషా, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీతో కలిసి తన కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ఈఈ ఏఈలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు ఎక్కువ అవక ముందే పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల విషయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తేవాలని సూచించారు.

ఎల్‌బీనగర్ ప్రజల రుణం తీర్చుకోలేనిది

● హైడ్రా నగర ప్రజలకు విషాదాన్ని మిగిల్చింది ● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ ప్రజల ఆశీర్వాదంతో అత్యంత మెజార్టీతో విజయం సాధించానని, ఎల్‌బీనగర్ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, వారికి ఎంత చేసినా తక్కువేనని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్‌లో శుక్రవారం ఆదర్శ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనాన్ని ప్రారంభించి, సహారా స్టేట్స్ కాలనీలోని బీటీ రోడ్లను పరిశీలించారు. అనంతరం బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 11 ఏళ్లు పూర్తయిన సందర్భంతో పాటు ఎంపీగా ఏడాది కాలం గడిచిందని మల్కాజిగిరి ప్రజలతో ఆత్మీయంగా గడపాలని ఆదివారం సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు మోదీ అభివృద్ధితో పాటు ఏడాదిగా మల్కాజిగిరి పార్లమెంట్‌కు తీసుకువచ్చిన నిధులపై వివరిస్తామన్నారు. గతంలో మల్కాజిగిరి పార్లమెంట్ ప్రజాప్రతినిధి ఏనాడూ నియోజకవర్గానికి వచ్చిన పాపాన పోలేదని, కరోనా వంటి విపత్కర పరిస్థితిల్లో ఆపదలో ఉన్న నియోజకవర్గ ప్రజలను ఆదుకుని భరోసా కల్పించాల్సిన బాధ్యతను విస్మరించారని విమర్శించారు. ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న నగర ప్రజలను మూసీ ప్రక్షాళన పేరుతో కళ్ల ముందే ఇళ్లను కూల్చివేయడాన్ని అడ్డుకుని నగర ప్రజలకు భరోసా ఇచ్చామని తెలిపారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలాలు అంటూ హైడ్రా పేరుతో నగర ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం విషాదాన్ని నింపిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సామ రంగారెడ్డి, వన్‌పల్లి శ్రీనివాస్ రెడ్డి, రవీందర్‌గౌడ్, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, రంగ నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

